భద్రాద్రి సీతారాములకు బంగారు పట్టు చీర రెడీ

భద్రాద్రి రాములోరి కల్యాణానికి సిరిసిల్ల నేత కార్మికుడు విజయ్ త్రీడీ కలర్ బంగారు చీరను తయారు చేసి ఆదివారం ఆవిష్కరించారు. సీతమ్మ కోసం మూడు వర్ణాలతో త్రీడీ చీరను మగ్గంపై నేశారు. బంగారం, వెండి జరి, ఎరుపు రంగు పట్టు పూలతో.. ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగులాల వెడల్పు, 600 గ్రాముల బరువుతో చీరకు తయారుచేశారు.

-రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ)

జూన్‌లో స్థానిక ఎన్నికలు కష్టమే



సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన అంతా తూచ్!

- పదవుల ఆశ చూపి.. క్యాడర్‌కు ఎర
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. బీసీ రిజర్వేషన్లు తేల్చకుండా స్థానిక ఎన్నికల నిర్వహణ కుదరదు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు
- ఇంకా సిద్ధంకాని కమిషన్ రిపోర్టు
- బీసీ గణనపై స్పష్టతివ్వని ప్రభుత్వం
- చిక్కుముడులు విప్పేందుకు ఐదారు నెలలు పట్టే చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నట్టు జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా? పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే స్థానిక సమరం మొదలవుతుందా? ఈ ప్రశ్నలకు అసాధ్యం అని సమాధానం చెప్తున్నారు న్యాయ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు. స్థానిక సంస్థల పదవుల ఆశ చూపి, పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం నింపి, తద్వారా లోక్‌సభ ఎన్నికల గండం గట్టెక్కడానికే రేవంత్‌రెడ్డి ఈ ప్రకటన చేసి ఉంటారని విశ్లేషకులు భావిస్తున్నారు. జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు బీసీ రిజర్వేషన్ అంశం ప్రధాన అడ్డంకిగా మారుతుందని చెప్తున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని జూన్‌లోగా తేల్చడం ఆషామాషీ వ్యవహారం కా దని గుర్తుచేస్తున్నారు. మరికొన్ని కారణాల రీత్యా ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు సాధ్యం కాదని భావిస్తున్నారు. నిజానికి, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ఇప్పటికే ముగిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల గడువు జూన్‌తో ముగియనున్నది. అత్యధిక పట్టణ స్థానిక సంస్థల పదవీ కాలం కూడా వచ్చే జనవరిలో పూర్తికానున్నది. ఆయా ఎన్నికలను నిర్వహించాలంటే ముందుగా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాల్సి ఉంటుంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది.

ప్రత్యేక కమిషన్ ఏర్పాటు

సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు ప్రాతిపదికను నిర్ణయించడానికి, అధికారికంగా బీసీ జనాభా లెక్కలు తీయడానికి ప్రత్యేకంగా (డెడికేటెడ్) బీసీ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ పలు రాష్ర్టాల్లో పర్యటించి అక్కడ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను అమలుచేస్తున్న విధానం, బీసీ జనాభా లెక్కలను ఖరారు చేసిన విధానాలపై అధ్యయనం చేసింది. మన రాష్ట్రంలోని పలు శాఖల అధికారులతోనూ సమావేశమైంది. నివేదికకు తుది రూపు ఇవ్వడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా కులగణనను తెరపైకి తీసుకొచ్చింది. దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసింది. బీసీ కులాలే కాదు అన్ని కులాల లెక్కలను తేల్చాలని నిర్ణయించింది. అయితే, ఇందుకు సంబంధించిన క్షేత్రస్థాయి పనులు ఇంకా ప్రారంభంకాలేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమలులో ఉండటం, అధికారులంతా ఎన్నికల పనుల్లో బిజీగా ఉండటంతో మరో రెండు నెలల వరకు కులగణన ప్రారంభమయ్యే అవకాశమే లేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత కనీసం నాలుగైదు నెలలపాటు పూర్తిస్థాయిలో దృష్టి పెడితే తప్ప కులగణన వ్యవహారం ఒక కొలిక్కిరాదని అధికారులు భావిస్తున్నారు. కానీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో లెక్కలన్నీ తీయాల్సి ఉంటుంది. బీసీ కమిషన్ ఇచ్చే నివేదికను ప్రాతిపదికగా తీసుకొని బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తారా? లేక కొత్తగా కమిషన్ ఏర్పాటు చేస్తారా? ఉన్న కమిషన్‌కే బాధ్యతలు అప్పగిస్తారా? అనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 'డెడికేటెడ్ కమిషన్' ఇచ్చే నివేదిక ఆధారంగానే రిజర్వేషన్లను ఖరారు చేసి కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ నివేదికపై సుప్రీంకోర్టు సంతృప్తి చెందితేనే, కోర్టు అనుమతితో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుంది. నివేదికపై ఏమైనా అభ్యంతరాలు వ్యక్తమైతే మరింత సమయం పట్టే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన కనీసం వచ్చే దసరా వరకు రిజర్వేషన్లు కొలిక్కి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నారు. రిజర్వేషన్లు కొలిక్కి వచ్చిన తరువాత కూడా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయడానికి మరికొన్ని నెలలు పట్టే అవకాశం ఉంటుందని చెప్తున్నారు.

ఎన్నికల సంఘం ప్రక్రియ

గ్రామ పంచాయతీలను వార్డులవారీగా విభజించాలి. కొత్త ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేయడం, పునర్విభజన చేయడం వాటి ఆధారంగా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం తయారుచేయాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాలను నిర్ధారించాల్సి ఉంటుంది. ఇందుకు కనీసం మరో రెండు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. దీని కోసం ప్రభుత్వం ఏ పంచాయతీ, ఏ సామాజికవర్గానికి రిజర్వ్ అయిందో తేల్చి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఎన్నికల నిర్వహణ జరుగుతుంది. దీని కోసం కింది స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. బ్యాలెట్ బాక్సులు లేదా ఈవీఎంలను సిద్ధంచేయాలి. ఈ ప్రక్రియలన్నింటినీ జూన్‌లోగా పూర్తి చేయడం అసాధ్యమని విశ్లేషకులు చెప్తున్నారు.

కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటు

రాష్ట్రంలోని అనేక గ్రామాల ప్రజలు తమ గ్రామాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీటితోపాటు పలు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చడం, మున్సిపల్ కార్పొరేషన్ల సమీప గ్రామాలను ఆయా కార్పొరేషన్లలో విలీనం చేయాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ చట్ట సవరణ అవసరం. ఇందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టడమో లేదా ఆర్డినెన్స్ ఇవ్వడమో చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు సమయం పట్టే అవకాశం ఉన్నది.

తేలని రిజర్వేషన్ల పెంపు అంశం

రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6%, బీసీలకు 24% రిజర్వేషన్లు అమలవుతున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోతోపాటు బీసీ, ఎస్సీ డిక్లరేషన్లలో రిజర్వేషన్ల శాతాన్ని వారి జనాభా ప్రాతిపదిక పెంచుతామని హామీ ఇచ్చింది. స్థానిక సంస్థల్లో ఎస్సీలకు 18%, బీసీలకు 42% ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రకటించింది. సుప్రీంకోర్టు గత ఎన్నికల సమయంలో పేర్కొన్న ప్రకారం.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీలులేదు. కాంగ్రెస్ హామీ అమలు కావాలంటే తమిళనాడు తరహాలో పార్లమెంట్ ద్వారా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల శాతాన్ని చేర్చాల్సి ఉంటుంది. అలా అయితేనే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుంది.

బీసీల ప్రస్తావన లేని బీజేపీ మ్యానిఫెస్టో

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ) : ప్రధానమంత్రి బీసీ అయినా బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీల అభివృద్ధికి ఒక్క అంశం కూడా లేకపోవడం శోచనీయమని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తంచేశారు. 76 ఏండ్ల స్వాతంత్ర్య దేశంలో 70 కోట్ల మంది బీసీ ప్రజల వాటా బీసీలకు ఇవ్వరా? అని ఆదివారం ఒక ప్రకటనలో కృష్ణయ్య ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య దేశం.. బీసీలు బిచ్చగాళ్లు కాదు.. వాటాదారులు అని, వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదు అని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ బీసీల అనుకూల వైఖరి అవలంబించి, బీసీలకు చట్టసభలలో 50% రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు జాతీయ స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, స్కాలర్‌షిప్ ప్రవేశపెడతామని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ఏటా రెండు లక్షల కోట్ల బడ్జెట్ బీసీల అభివృద్ధికి కేటాయిస్తామని ప్రకటించాలని కోరారు.

కేకేకు కాంగ్రెస్ సీఎం పదవి ఇస్తుందా?

బీఆర్‌ఎస్‌లో సకల భోగాలు అనుభవించి ఇప్పుడు చిల్లర వ్యాఖ్యలా?

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎంపీ కే కేశవరావుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికిప్పుడు ముఖ్యమంత్రి పదవి ఇస్తుందా? బీఆర్‌ఎస్‌లో దక్కినంత గౌరవం దక్కుతుందా? అని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. 'కడుపునిండా తిన్నంక గారెలు చేదు' అన్నట్టు కేకే వ్యహారం ఉన్నదని ఎద్దేవాచేశారు. బీఆర్‌ఎస్‌లో సకల భోగాలు అనుభవించి ఇప్పుడు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. తన కుటుంబాన్ని కేటీఆర్ చీల్చారంటూ కేకే చిల్లర ఆరోపణలు చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. కేకే తన కుటుంబాన్ని తానే, తన స్వహస్తాలతో చీల్చుకున్నారని ఆరోపించారు. కూతురి రాజకీయ భవిష్యత్తు కోసం కొడుకును దూరం చేసుకున్నారని తెలిపారు. కొడుకును పార్టీ మారాలంటూ అర్ధరాత్రి మెసేజ్‌లు పెట్టి వేధించి దూరం చేసుకున్నారని పేర్కొన్నారు. తాను చేసిన తప్పునకు కేటీఆర్‌పై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. కేశవరావుకు బీఆర్‌ఎస్‌లో ఇచ్చిన గౌరవం దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎక్కడా దొరకలేదని చెప్పారు. కేకేకు రెండుసార్లు రాజ్యసభతోపాటు పార్టీ సెక్రెటరీ జనరల్ హోదా ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కేకే కుటుంబానికి కూడా కేసీఆర్ ఇచ్చినంత గౌరవం మరొకరు ఇవ్వలేదని తెలిపారు. తన కూతురు విజయలక్ష్మికి జీహెచ్‌ఎంసీ మేయర్ పదవి దక్కించుకున్న కేకే.. బీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లాక తన కొడుకుకి ఎమ్మెల్సీ ఇవ్వలేదని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన కుట్రలు ఎట్టి పరిస్థితుల్లోనూ సఫలీకృతం కావని పేర్కొన్నారు.

విద్యుత్తు ఒప్పందాల్లో అధికారులకు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ఉత్పత్తికేంద్రాల నిర్మాణంపై ప్రభుత్వం నియమించిన జ్యుడీషియల్ కమిషన్ విచారణను ప్రారంభించింది. ఈ మూడు అంశాల్లో నిర్ణయాలు తీసుకోవడం, ఒప్పందాలు చేసుకోవడంలో భాగస్వామ్యమైన 20 మందికిపైగా అధికారులు, సభ్యులకు ఆదివారం నోటీసులు జారీచేసింది. కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి.. ఇంకా కొంతమంది అధికారులకు నోటీసులు పంపించాల్సి ఉండగా, ఈ వారంలో వారికి కూడా నోటీసులు అందజేయనున్నారు. వీరిలో ప్రస్తుతం పనిచేస్తున్నవారితో పాటు పదవుల నుంచి వైదొలిగినవారున్నారు. ప్రస్తుతం నోటీసులు అందుకొన్నవారిలో రాజకీయనేతలెవరులేరని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఇక నోటీసులందుకున్న వారు తమ ముందు హాజరయ్యి వాదనలు వినిపించవచ్చని కమిషన్ తెలిపింది. ఈ మూడు అంశాలపై కమిషన్ ప్రజల నుంచి సైతం అభిప్రాయాలు సేకరిస్తున్నది.

వేసవిలో కోతల్లేని విద్యుత్తుకు కృషి : వీఏవోఏటీ

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : వేసవి దృష్ట్యా రాష్ట్ర ప్రజలకు కోతల్లేని, నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కృషిచేస్తామని విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) నేతలు తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపకంటి అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా రైతాంగం సహా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు తమ వంతుపాత్రను పోషిస్తామని నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో అన్నారు. అంతేకాకుండా విద్యుత్తు సంస్థ బలోపేతానికి కృషిచేస్తామని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ నేతలు పరమేశ్ సహా ఇతర నాయకులు ఉన్నారు.

హామీలు మరిచిపోవటం బీజేపీకి వరం

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : బీజేపీకి ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వటం ఎంత సులభమో, వాటిని మరచిపోవడం కూడా అంతే సులభమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. బీజేపీ కొత్త మ్యానిఫెస్టో గురించి మాట్లాడే ముందు ఆ పార్టీకి ధైర్యం ఉంటే 2014 మ్యానిఫెస్టో గురించి మాట్లాడాలని ఆయన ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. 2014లో విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని దేశానికి తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తాం అని చెప్పిన బీజేపీ దాని గురించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల సమయంలో రైతులకు వడ్డీ లేకుండా రూ. లక్ష రుణాలు ఇస్తామని చెప్పారని, రాష్ట్రంలో ఎంత మంది రైతులకు వడ్డీలేని రుణాలు కేంద్రం నుంచి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఎన్నికల సందర్భంగా భారత్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తాం చెప్పటం బీజేపీకి ఫ్యాషన్‌గా అయిపోయిందని మండిపడ్డారు. 2019లో రైతుల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ. 25 లక్షల కోట్ల కేటాయిస్తాం అని చెప్పిన బీజేపీ 5 సంవత్సరాలలో ఎన్ని లక్షల కోట్లు కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అని పేర్కొన్న బీజేపీ ఈసారి కొత్తగా మూడు కోట్ల మందికి పక్కా ఇల్లు వాగ్దానం చేస్తున్నారంటే గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఒప్పుకున్నట్టేనని ఆయన ఎద్దేవా చేశారు. 2019లో ప్రతి కుటుంబానికి వంట గ్యాస్ అని చెప్పి ఇప్పుడూ అదే చెప్తున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణలోని దేవాలయాల కోసం కేంద్రం నుంచి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 2019లో వన్‌మిషన్, వన్ డైరెక్షన్ అంటే 2024లో వన్ నేషన్ వన్‌ఎలక్షన్ అని కొత్తపలుకు పలుకుతున్నారు. రాష్ట్రంలో మాములు రైళ్లకే దిక్కు లేదని, బుల్లెట్ రైలు అని పేర్కొనటం సిగ్గుచేటన్నారు. 2024 బీజేపీ మ్యానిఫెస్టోలో తమిళ భాషని విశ్వవ్యాప్తం చేస్తామని పేర్కొన్నారు సరే, మరి తెలుగు భాషా ఏం పాపం చేసిందని ప్రశ్నించారు.

మాటల్లో వికసిత్.. చేతల్లో విభజిత్!

మొదటిపేజీ తరువాయి...

మ్యానిఫెస్టోపై ఆయన రంగాల వారీగా ఎత్తి చూపిన అంశాలు ఆయన మాటల్లోనే...

- **రైతు రుణమాఫీ ఊసేలేదు :** దేశవ్యాప్తంగా అనేక రాష్ర్టాల నుంచి రైతుల రుణమాఫీ భారాన్ని కేంద్రం కూడా భరించాలని డిమాండ్లు వచ్చాయి. కానీ బీజేపీ మ్యానిఫెస్టోలో రైతుల రుణమాఫీపై ఒక్క మాట కూడా హామీ ఇవ్వలేదు. కార్పొరేట్ కంపెనీల రుణాలను రూ. 12 లక్షల కోట్ల వరకు మాఫీ చేసిన మోదీ సర్కార్, పదేండ్లలో కనీసం ఒక్క రైతుకు ఒక్క రూపాయి కూడా రుణం మాఫీ చేయలేదు. రాబోయే కాలంలో రుణమాఫీ చేసేది లేదని మ్యానిఫెస్టోలోనే చెప్పినట్టయింది.
- **జాతీయ ప్రాజెక్టు ఊసేలేదు :** ప్రతీ రాష్ర్టానికి కనీసం ఒక్కటైనా భారీ నీటి పారుదల ప్రాజెక్టును కేంద్ర నిధులతో నిర్మించాలని దేశవ్యాప్తంగా అనేక రాష్ర్టాలు డిమాండ్ చేశాయి. కానీ, బీజేపీ మ్యానిఫెస్టోలో ఇందుకు సంబంధించిన ఎలాంటి హామీ లేదు.
- **మధ్య తరగతికి ఆదాయపన్ను రాయితీ లేవీ?:** అల్పాదాయ, మధ్య తరగతి జీవులకు ఆదాయపన్నులో రాయితీలు కల్పించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఏడాదికి రూ. 5 లక్షల వరకు ఆదాయమున్న వారికి పన్ను మినహాయింపు, రూ. 10 లక్షల వరకు 5 శాతం పన్ను కోసం డిమాండ్లు ఉన్నాయి. కానీ, బీజేపీ మ్యానిఫెస్టోలో ప్రస్తావనే లేదు.
- **కార్మికులు, చేతివృత్తులకు చేయూత ఏదీ?:** తెలంగాణలో సింగరేణి మాదిరిగా దేశవ్యాప్తంగా గనుల్లో, కార్ఖానాల్లో, ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికులకు ఆదాయ పన్ను మినహాయించాలని ఎన్నో కార్మిక సంఘాలు కేంద్రాన్ని కోరాయి. కానీ, ఆ విషయమే బీజేపీ పట్టించుకోలేదు. చేతివృత్తుల ద్వారా వస్తువులు తయారు చేసి అమ్మే వారికి కూడా పన్ను మినహాయింపు ఇచ్చే విషయంపై బీజేపీ హామీ ఇవ్వలేదు.
- **చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ పెంపు ప్రస్తావనేది?:** బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు చేస్తామని గొప్పగా చెప్పుకోవడం తప్ప చేతల్లో చేసిందేమీ లేదు. ఎన్నికల సంస్కరణలు తెచ్చి జమిలీ ఎన్నికలు పెడతామని చెప్పారు తప్ప, బీసీల రిజర్వేషన్ గురించి ప్రస్తావన లేదు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపింది. కానీ, బీజేపీ మ్యానిఫెస్టోలో ఆ విషయమే లేదు.
- **ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ గురించి హామీ లేదు:** ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడానికి తప్ప నిజంగా ఎస్సీ, ఎస్టీలకు బీజేపీ చేసిందేమీ లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ర్టాల్లో ఎంఆర్‌పీఎస్, ఎల్‌హెచ్‌పీఎస్ ఉద్యమాలు నడిచినట్టే దేశవ్యాప్తంగా కూడా ఎస్సీ, ఎస్టీలు వర్గీకరణ కోరుకుంటున్నారు. బీసీ మాదిరిగానే వర్గీకరణ డిమాండ్ చేస్తున్నారు. ఆయా వర్గాలను మభ్యపెట్టడమే తప్ప, బీజేపీ మ్యానిఫెస్టోలో ఈ డిమాండ్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.
- **50 శాతం రిజర్వేషన్ పరిమితి పెంచడంపై...:** ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ, దేశంలో రిజర్వేషన్ 50 శాతం దాటొద్దనే నిబంధన అమలవుతోంది. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచుకునే వెసులుబాటు కోసం పార్లమెంటులో చట్టం తేవాలని డిమాండ్ ఉంది. కానీ, బీజేపీ మ్యానిఫెస్టోలో ఆ విషయమే లేదు.
- **హైదరాబాద్ సహా మెట్రో నగరాల అభివృద్ధిపై స్పందన లేదు :** భారతదేశానికి గర్వకారణంగా నిలుస్తూ, దేశానికి అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న 6 ప్రధాన నగరాల అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, అక్కడి ప్రజలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, కలకత్తా, ముంబై, చెన్నై, బెంగుళూరుతో పాటు భారతదేశానికి చెందిన ప్రధాన నగరాలు. వీటి అభివృద్ధి దేశ అభివృద్ధితో ముడిపడి ఉంది. ఈ మెట్రో నగరాల అభివృద్ధి గురించి బీజేపీ మ్యానిఫెస్టోలో ఎలాంటి హామీ లేదు.
- **ఉచిత పథకాలపై బీజేపీ చెప్పిందేమిటి? చేసిందేమిటి? :** పదేండ్లలో చేసిందేమీ లేకపోవడంతో ఈ సారి ఎన్నికల్లో గెలిపిస్తే ఉచిత పథకాలు అమలు చేస్తామని హామీ ఇస్తున్నారు. ఉచిత రేషన్, ఉచిత విద్యుత్, ఉచిత వైద్యం, ఉచిత ఇండ్లు పేరుతో ఉచిత పథకాల జపం చేశారు. వివిధ రాష్ర్టాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, వాటిని తప్పుపట్టిన మోదీ తన మ్యానిఫెస్టోలో మాత్రం మొత్తం ఉచిత పథకాల హామీనే ఇచ్చారు. మోదీ ప్రభుత్వం గడిచిన పదేండ్లలో అమలు చేసిన పథకాలన్నీ అందరికీ కాకుండా కొందరికే పరిమితం చేశారు. అది రేషన్ బియ్యం అయినా, రైతులకు ఆర్థిక సహాయమైనా, ఉచిత వైద్యమైనా, ఉచిత ఇండ్లయినా అదే జరిగింది. ఇప్పుడు కూడా అదే జరుగుతుంది. సుస్థిరత, సమర్థత, భద్రత, సంకల్ప్ లాంటి గంభీరమైన మాటలు జోడించి పేజీలు నింపారు తప్ప, నిజంగా భారతీయ సమాజం ఇవ్వాళ ఏమి కోరుకుంటున్నదో గుర్తించి, దానిపై పార్టీ విధానం ప్రకటించలేదు. ప్రజలంతా ఈ మ్యానిఫెస్టోను తిరస్కరించారని, బీజేపీకి ఓటు వేయవద్దని కోరుతున్నాను' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బోనస్ ఇవ్వకపోతే సెక్రటేరియట్ ముట్టడి

రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు రాయాలి

- కేసీఆర్‌కు, కాంగ్రెస్ పాలనకు తేడాను ప్రజలు గుర్తించారు
- కాంగ్రెస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం కుదిరింది
- సంగారెడ్డి జిల్లా పర్యటనలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- సుల్తాన్‌పూర్‌లో కేసీఆర్ బహిరంగసభ ఏర్పాట్ల పరిశీలన

సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో కేసీఆర్ బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే చింతా, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

నారాయణఖేడ్/సంగారెడ్డి ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రైతులకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని, లేకపోతే రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల 16న సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్‌పూర్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లు, జనసమీకరణపై ఆదివారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేసి, బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతులు తొందరపడి ధాన్యాన్ని అమ్మొద్దని, ప్రభుత్వం మద్దతు ధర, బోనస్ ఇచ్చే వరకు రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌కు రైతులు లేఖలు రాసి పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాలని కోరారు. రైతు నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో ఉత్తరాలు రాయించాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడాను గుర్తించారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై రహస్య ఒప్పందం చేసుకొన్నాయని ఆరోపించారు. బీజేపీ మ్యానిఫెస్టో డొల్ల అని, దేవుడి పేరుతో రాజకీయం చేసే ఆ పార్టీకి ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో 3 ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా కాంగ్రెస్ మాదిగలకు కేటాయించకపోవటం విడ్డూరం గా ఉన్నదని విమర్శించారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్క మైనార్టీకీ స్థానం కల్పించలేదని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో తెలంగాణవాదం వినిపించాలన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలన్నా ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, జైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష మందితో సభ

సుల్తాన్‌పూర్ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ ఏర్పాట్లు చేస్తున్నది. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల నుంచి ప్రజలు హాజరుకానున్నారు. యువత, రైతులు, మహిళలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా బీఆర్‌ఎస్ ఏర్పాట్లు చేపడుతున్నది. 16న సాయంత్రం కేసీఆర్ బహిరంగసభ ప్రారంభం కానున్నది. కేసీఆర్ హైదరాబాద్ నుంచి నేరుగా సుల్తాన్‌పూర్‌లోని బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరనున్నారు.

అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు రెడీ

- అందుబాటులోకి 18 ఫైర్ స్టేషన్లు
- 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు
- రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ వై నాగిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : వేసవిలో అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నామని రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 18 ఫైర్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు. మంటలు ఆర్పేందుకు సరికొత్త టెక్నాలజీ అందిపుచ్చుకొంటూ దీటుగా ప్రమాదాలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫైర్ ట్రైనింగ్ స్కూల్‌లో అగ్నిమాపకశాఖ వారోత్సవాల పోస్టర్‌ను నాగిరెడ్డి ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల్లో అమరులైన సిబ్బందికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్తగా 39 ఫైరింజన్లు, 18 మినీ ఫైరింజన్లు, ఫైర్‌సూట్స్, బ్రీతింగ్ కిట్స్, స్మోక్ ఎక్విప్‌మెంట్స్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వచ్చే వర్షాకాలానికి కూడా 20 బోట్లు, లైఫ్‌బాయ్స్‌ను కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. 86 బిల్డింగ్‌ల యజమానులకు ఫైర్ సేఫ్టీ సామగ్రి పెట్టించుకోవాలని నోటీసులు ఇచ్చామని నాగిరెడ్డి వివరించారు. కేర్‌లెస్ స్మోకింగ్ వల్ల అధికంగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయని, సిగరెట్, బీడీలు, చుట్టలు తాగేవారు.. వాటిని రోడ్డుమీద పడేయకుండా పూర్తిగా ఆర్పివేయాలని కోరారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వరకు ఆస్పత్రులు, స్కూల్స్, మాల్స్, భవన సముదాయాలు, పబ్లిక్ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. వీటితో పాటు వర్క్‌షాపులు, సెమినార్‌లు, గెస్ట్ లెక్చర్స్, డ్రాయింగ్ పోటీలు, మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని నాగిరెడ్డి తెలిపారు. అనంతరం వట్టినాగులపల్లి ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న 487 మంది ఫైర్ ట్రైనీలకు దిశానిర్దేశం చేశారు. పలు క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ డైరెక్టర్ లక్ష్మిప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ జీవీ నారాయణరావు, ఆర్‌ఎఫ్‌వో హరినాథ్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, డీఎఫ్‌వోలు, ఏడీఎఫ్‌లు పాల్గొన్నారు.

పాత, కొత్తల మధ్య సమన్వయ లోపం

- అసెంబ్లీ ఎన్నికలప్పటి జోష్ కొరవడింది
- మల్కాజిగిరి, చేవెళ్ల, సికింద్రాబాద్‌లో వెనుకబడ్డాం
- అలసత్వానికి తావులేదు.. అతివిశ్వాసానికి పోవొద్దు
- కాంగ్రెస్ నేతలకు కేసీ వేణుగోపాల్ క్లాస్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) 'అసెంబ్లీ ఎన్నికలప్పటి జోష్, పట్టుదల పార్లమెంట్ ఎన్నికల్లో కొరవడింది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీల కంటే చాలా వెనుకబడి ఉన్నాం. పార్టీలో కొత్తగా చేరిన నేతలకు, పాత వారికి మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. మనమే గెలుస్తామన్న అతివిశ్వాసం అసలు వద్దు. అలసత్వానికి తావులేదు. ఇక్కడ ఏం జరుగుతున్నదో అధిష్ఠానానికి అంతా తెలుసు. మంత్రులు తమకు అప్పగించిన నియోజకవర్గాల్లోనే ఉండాలి. తెలంగాణపై అధిష్ఠానం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. ఎన్నికల మ్యానిఫెస్టో క్షేత్రస్థాయికి వెళ్లలేదు' అని రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ క్లాస్ పీకినట్టు తెలిసింది. మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్లలో ప్రత్యర్థి పార్టీల కంటే మన అభ్యర్థులు వెనుకబడి ఉన్నారంటూ ఒక నివేదికను చూపించినట్టు సమాచారం. శంషాబాద్ నోవాటెల్‌లో ఆదివారం సాయంత్రం పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విష్ణు తదితర కీలక నేతలతో వేణుగోపాల్ చర్చించారు. సమావేశానికి కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా హాజరై నియోజకవర్గాలవారీగా తాజాగా తమ టీమ్ నిర్వహించిన ఫ్లాష్ సర్వే వివరాలను వెల్లడించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. కొందరు అభ్యర్థులు టికెట్ కోసం చూపిన ఆసక్తిని ప్రచారంలో కనబరచడం లేదని అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. బీజేపీకి ఉత్తరాదిలో ప్రాబల్యం తగ్గుతున్నదని, దీంతో దక్షిణాదిపై ఫోకస్ చేస్తున్నదని, కాబట్టి తెలంగాణలో ఆ పార్టీనే టార్గెట్ చేయాలని సూచించినట్టు తెలిసింది. జిల్లాల్లో చాలామంది నాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తి చూపుతుంటే, స్థానిక నాయకత్వం వారిని అడ్డుకుంటున్నట్టు తమకు సమాచారం ఉన్నదని, అలా చేయడం వల్ల వారు బీజేపీలో చేరితే మనకు నష్టం కాదా? అని ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీలోకి వచ్చే వారిని పాత వారు కలుపుకొని పోవాలని, సమన్వయ లోపం ఉండకూడదని సూచించినట్టు తెలిసింది. మంత్రులకు, నాయకులకు మధ్య సమన్వయలోపం ఉన్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అలా జరగకుండా చూసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరినట్టు సమాచారం ఉన్నదని పేర్కొన్నట్టు తెలిసింది.

త్వరలో మరో కీలక నేత చేరిక

బీఆర్‌ఎస్‌కు చెందిన మరో కీలక నేత కాంగ్రెస్‌లో చేరబోతున్నారని కేసీ వేణుగోపాల్ రాష్ట్ర పార్టీ నేతలకు హింట్ ఇచ్చినట్టు తెలిసింది. ఆ నాయకుడు ఎవరు అనేది మాత్రం సమావేశంలో ఆయన వెల్లడించలేదని తెలిసింది. పార్టీ నేతలు, అభ్యర్థులతో సమావేశం ముగిశాక సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీతో కేసీ వేణుగోపాల్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠాన నిర్ణయాన్ని వీరికి వివరించినట్టు తెలిసింది.

15 సీట్లు గెలిచి తీరాలన్నారు : కొండా సురేఖ

రాష్ట్రంలో మిషన్ 15 లక్ష్యంతో పనిచేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఆదేశించారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. శంషాబాద్ నోవాటెల్‌లో పార్టీ సమావేశం ముగిసిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మూడు స్థానాలకు కూడా వెంటనే అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారని తెలిపారు.